నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | జనవరి 17, 2024 | www.navatelangana.com

క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్



క్రీడాకారులకు జెర్సీలను అందజేస్తున్న సర్పంచ్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో ఆటగాళ్లకు జర్సీల పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ యువకులు స్ట్రైకర్ క్రీడా రంగంలో తమ ప్రతిభను కొనసాగిస్తు గ్రామ పేరును నిలబెట్టాలని సర్పంచ్ అన్నత్ వార్ వినోద్ ఆకాంక్షించి అందజేశారు. గ్రామీణ ప్రాంత యువత చేడు మార్గాలలో వెళ్లకుండా నియంత్రణలో ఉంటు క్రీడల్లో రాణించాలని, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు.

జైపాల్ రెడ్డికి నివాళులర్పించిన జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత కీ.శే. సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని స్ఫూర్తి స్థల్ (జైపాల్ రెడ్డి మెమోరియల్) దగ్గర ఆయన విగ్రహానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు సోమవారం నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలను రాష్ట్ర ప్రజలు మరువరని గుర్తు చేశారు.



ఒక పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులు సురక్షితం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని గుడిమెట్ స్టేజి వద్ద ఆర్టిసి బస్సు అదుపుతప్పి బస్సు రోడ్డు పక్కకు ఓడిగిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమెట్ శివారులో గల బాన్సువాడ కామారెడ్డి రహదారిపై వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గుర్యయ్యారు. బస్సు ఆగిపోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనచోటు చేసుకోలేదని ప్రయాణికులు తెలిపారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిపారు. కాగా డ్రైవర్ నిర్లక్ష్యంతో ఈ ఘటన జరిగిందని ప్రయాణికులు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

- పోటా పోటీగా గాలిపటాలు ఎగురవేత
- ఆకట్టుకున్న ముగ్గులు

నవతెలంగాణ-విలేకరులబృందం





రైతునగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. కోలాటాలతో యువతుల నృత్యం

సంక్రాంతి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరూ వేడుకలు నిర్వహించుకున్నారు. ఉదయం ఇంటి ముందు ముగ్గులు వేసి సందడి చేయగా.. గాలిపటాలు పోటాపోటీగా ఎగురవేశారు. పిండివంటలు చేసి ఇంటిల్లిపాది ఆనందంగా పండుగను నిర్వహించుకున్నారు.

కుటుంబీకును ఏకం చేసే పండుగ..

కామారెడ్డి : సంక్రాంతి పండగ అంటేనే కుటుంబ సభ్యులను అందరిని ఏకం చేస్తూ, పిండి వంటలు, వారికి సాయంగా ఇతర కుటుంబీకులు బాధ్యతలు పంచుకుంటారు. పుట్టి పెరిగిన ఊరును వదిలి ఉద్యోగాల వేటలో పట్టణాలకు వలస వెళ్లిన వారు పల్లెలకు వస్తూ కుటుంబాలను, కుటుంబీకులను తల్లిదండ్రులతో, కొత్తలలు అత్తవారిండ్లకు వచ్చి ఆప్యాయంగా సంబరాలలో మునిగితేలు తుంటారు. సంక్రాంతి వచ్చిందంటే మహిళలకు ముగ్గులు అంటే భలే ఇష్టం. సంక్రాంతి, కనుమ పండగలను అత్యంత సంబరంగా నిర్వహించారు. మహిళలు, పిల్లలు వేకువ జామున వాకిళ్ల ముందు ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. పెద్దలు చిన్నారులకు భోగి పనులు పోసి ఆశీర్వదించారు. చిన్న, పెద్ద ఉత్సాహంగా గాలిపటాలను ఎగరవేసి ఇంటిల్లిపాది సంతోషంగా గడిపారు.

నాగిరెడ్డిపెట్ : నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చిన్నారులు గాలిపటాలు ఎగరేస్తూ పండగను సంతోషంగా జరుపుకున్నారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద మొత్తంలో తమ తమ వాకిళ్లలో రకరకాల ముగ్గులు వేస్తూ అలరించారు.

ఘనంగా సంక్రాంత్రి సంబరాలు

పిట్లం/లింగంపేట్ : మండలంలో ప్రజలు సంక్రాంత్రి పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు, సంక్రాంతి , కనుమ పండగ సంబరాలలో భాగంగా గ్రామ వాడవాడలా ఇంటి లోగిళ్ళలో రంగవల్లులతో సంబరాలు నిర్వహించారు. చిన్నారులు , యువకులు , పెద్దలు పతంగులు ఎగురవేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. ఏడాది కాలంలో సుఖ సంతోషాలు, పాడి పంటలతో, ధాన్యరాసులతో వర్ధిల్లాలని పలు ఆలయాలను దర్శించుకొని కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో పిండి వంటలతో సంబరాలు నిర్వహించుకున్నారు.

రామారెడ్డి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో 12 తేదీ నుండి 15 తేదీ వరకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా అంజి టీవీ బజరంగీస్ విజయం సాధించి, కప్పును గెలుపొందారు.



కామారెడ్డిలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



లింగంపేట్‌లో..

వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సందడి

నవతెలంగాణ-మద్నూర్



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే సంక్రాంతి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. మద్నూర్, డోంగ్లి మండలాల్లో విస్తృతంగా పర్యటన చేపట్టి కార్యకర్తలను, నాయకులను పలకరించి జోష్ నింపారు. డోంగ్లి మండలంలోని ఆ పార్టీ మండల అధ్యక్షులు శశాంక్ పాటిల్ చేనులో నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు అలాగే లింబూర్ గ్రామంలో జరిగిన మాజీ ఎంపీపీ గోదావరి బసవంతరావు పాటిల్ నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అదే విధంగా మద్నూర్ మండల కేంద్రానికి చెందిన పాకల్ వార్ విజయ్ కుమార్ మాజీ సొసైటీ చైర్మన్ చేనులో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆహ్వానించిన వారి వద్దకు వెళ్లడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరికి ఆనందాన్ని సంతోషాన్ని కలిగించే పండుగని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

సేంద్రియ చెరకు సాగుతో బెల్లం తయారీ

- పరిశీలించిన విండో చైర్మన్

నవతెలంగాణ-సదాశివనగర్



బెల్ల తయారీని పరిశీలిస్తున్న చైర్మన్

ఆరోగ్యం కాపాడడానికి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న ఒక రైతు పంట చేనును పలువురు సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి ప్రజా ప్రతినిధులు, రైతులు పరిశీలించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన సురుకంటి మైపాల్ రెడ్డి అనే రైతు తనకున్న వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ పద్ధతిలో చెరుకు పంటను సాగు చేసి స్వయంగా బెల్లం తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. చెరుకు పంట సాగు వల్ల ఎకరానికి 40 క్వింటాళ్ల బెల్లం దిగుబడి వస్తుందని క్వింటాల్‌కు 11,000 రూపాయల చొప్పున విక్రయిస్తానన్నారు. చాలామంది ప్రజలు కిలోకు 110 రూపాయలు చెల్లించి బెల్లం తీసుకెళ్తారని ఆయన వివరించారు. తాను గత ఎనిమిదేళ్లగా సేంద్రియ వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నానని తనతో పాటు చాలామంది ఆరోగ్యాలు కాపాడడానికి కృషి చేస్తున్నానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలని మహిపాల్ రెడ్డి కోరారు. షుగర్ వ్యాధి ఉన్న వ్యక్తులు పెద్ద ఎత్తున బెల్లం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డిని పలువురు నాయకులు అభినందిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, , పైడి సంతోష్ రెడ్డి, చెట్యూరి ఆనంద్ రెడ్డి తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల గొంతుక.. నవతెలంగాణ

- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్ఐ సుధాకర్



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-రామారెడ్డి

పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని ఎస్ఐ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సుధాకర్ సోమవారం నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజాన్ని నిర్భయంగా రాయడమే జర్నలిజమని, బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉండే పత్రికల్లో నవతెలంగాణ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నవతెలంగాణ డివిజన్ ఇన్‌చార్జ్ మోత్కు నరేష్, రికవరీ ఇంచార్జ్ భాస్కర్, స్థానిక విలేఖరి తిరుపతి రెడ్డి, పోలీస్ సిబ్బంది లక్ష్మీకాంత్, సిద్ధి రాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు దొడ్డు రకం వడ్ల వేలం పాట

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద శివారులో గల విత్తన క్షేత్రంలో గురువారం దొడ్డు రకం వడ్ల వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఏడిఏ వీరస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన క్షేత్రంలో 120 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్ల అమ్మడానికి ఉన్నాయని దానికి సంబంధించి గురువారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు 2000 రూపాయలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఏడియే సూచించారు.

నిధుల కేటాయింపు పట్ల హర్షం

నవతెలంగాణ-గాంధారి



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి నియోజక వర్గానికి వివిధ అభివృద్ధి పనుల కోసం పది కోట్లు కేటాయిం చడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గాంధారి మండలం లోని గండివేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి మంగళవారం పాలభిషేకం నిర్వహించారు. గండిపేట్ ప్రభుత్వ పాఠశాల అవసరాల కోసం ఎమ్మెల్యే నిధులు కేటాయించడంతో గ్రామస్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. పాఠశాలకు నిధులు కేటాయించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న దంపతులు

నవతెలంగాణ-రామారెడ్డి



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న దంపతులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డి పేట గ్రామానికి చెందిన గడీల బైరయ్య.. కుటుంబాన్ని పోషించటానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కవడంతో, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భార్య భాగ్యలక్ష్మితో కలిసి కామారెడ్డి ప్రాంతంలో ఒంటరి మహిళలకు మాయ మాటలు చెప్పి డబ్బులు వసూల్ చేస్తున్నారు. మండలంలోని ఫకీరా తాండాకు చెందిన మహిళను గమనించి, భర్త చనిపోయాడని, మీకు రూ 40,000 వస్తాయని నమ్మబలికి ఆమె నుండి బలవంతంగా రూ 6000 తీసుకొని కామారెడ్డి బయలుదేరారు. జగదాంబ తండాకు చెందిన భూక్య బూలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. అయితే రామారెడ్డిలో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, పోలీసులను చూసి బైరయ్య, అతని భార్య భాగ్యలక్ష్మి పారిపోతుండగా పట్టుకొని విచారించారు. తమ నేరాన్ని అంగీకరించగా.. రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, అక్రమ వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎవరైనా బెదిరింపులకు, భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా వసూలు చేస్తే వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని చిన్న పోతంగల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన దోడ్లే బాలవ్వ అనారోగ్యంతో మృతిచెందింది. భర్త, కుమారులు ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు విరాళం సేకరించారు. ఎమ్మెల్యే మదన్మోహన్ కు సమాచారం అందించడంతో అంత్యక్రియలకు కార్యకర్తల ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయాన్ని ఆమె కుమార్తెకు అందజేశారు. ఆ కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ కుటుంబానికి ఇల్లు కేటాయించాలని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమాజ సేవకే రాజకీయాల్లోకి

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

నవతెలంగాణ-బిచ్కుంద/లింగంపేట్



మాట్లాడుతున్న పైడి ఎల్లారెడ్డి

కామారెడ్డిలో చదువుకున్న తాను జపాన్‌లోని ప్రముఖ కంపెనీల్లో సీఈవోగా పనిచేసి హైదరాబాద్‌లో ఫార్మ కంపెనీ నెలకొలిపి ఎందరో యువకులకు ఉపాధి కల్పించినట్లు ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి తెలిపారు. సమాజ సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ దేవాలయం సందర్శించి పూజలు నిర్వహించి మఠాధిపతి సోమయ్యప్ప స్వామిని కలిశారు. అనంతరం పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బిజెపి నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని అందులోని భాగంగానే జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో సోమయ్యప్ప స్వామిని కలిసినట్లు తెలిపారు. భావితరాల భవిష్యత్తు కోసం 'మార్పు కోసం ఒక్క అడుగు' అనే స్వచ్ఛంద సేవా నెలకొల్పి సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. దాంట్లో భాగంగానే గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ల ఏర్పాటు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ, మహిళలు, బాలికల పురోగతి కోసం కృషి తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారురు. బండయప్ప స్వామి మఠ సంస్థానంలో 10 లక్షల రూపాయలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలో తిరుగుతూ అక్కడ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. ఆయన వెంట అడ్వకేట్ నారాయణ, తోట సాయిలు, సత్యనారాయణరెడ్డి, రజనీకాంత్, సత్యనారాయణ, కృపాకర్, చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా 110 శుద్ధి జల కేంద్రాలు ఏర్పాటుచేశా

లింగంపేట్ : గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడకుండా శుద్ధి జలం తాగితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 110 శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.మంగళవారం లింగంపేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంతో మంది కోట్లాది రూపాయలు ఉన్నా సేవ చేయాలనే భావన ఉండదని అలాంటివారు డబ్బుకే పరిమితమైతార న్నారు. 'స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు సేవ చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. సేవా కార్యక్రమాలు చేపట్టడం అదృష్టంగా భావిస్తు న్నాను. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రతి గ్రామంలో, మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రాల వరకు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటు న్నానని తెలిపారు. ఈ కార్యక్రమం లో అడ్వొకెట్ నారాయణ తోట సాయిలు సత్యనారా యణ రెడ్డి రాజారామ్ రమేష్ సర్పంచ్ కొమ్ముల మహేష్ దాసరి సాయిలు దుర్గగౌడ్ పాల్గొన్నారు.

గంజాయి నూనె అమ్ముతున్న నిందితుల రిమాండ్



నవతెలంగాణ-కామారెడ్డి

గంజాయి నూనె అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంకాలం క్యాసంపల్లి గ్రామ శివారులో గల ఓపెన్‌ప్లేస్‌లో గంజాయి అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం తెలియగా తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి అక్కడ ఉన్న ఏడుగురిని పట్టుకొని విచారించగా వారి వద్ద 190 గ్రాముల గంజాయి నుండి తీసిన నూనె లభించినట్టు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమ స్వలాభం కోసం అరకు నుండి గంజాయి ఆయిల్‌ను తక్కువ ధరకు కొనుక్కొని వచ్చి అట్టి దానిని ఇక్కడున్న యువకులకు అధిక ధరకు అమ్మి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. దీంట్లో భాగంగానే ఆదివారం ఈ ఇద్దరు అక్కడున్న మిగతా ఐదుగురికి ఇట్టి గంజాయి ఆయిల్‌ను అమ్ముతుండగా తాము చాకచక్యంగా వ్యవహరించి పట్టుకొని కేసు నమోదు చేసి జైలుకు పంపించినట్లు తెలిపారు. వీరి వద్ద రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, రెండు స్కూటీలు, 7 మొబైల్ ఫోన్లు, 190 గ్రాముల గంజాయి నుంచి తీసిన నూనెను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నూనె విలువ సుమారు 97,500 ఉంటుందని తెలిపారు.

పోచారంలో ఆటల పోటీలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నాగిరెడ్డి పేట్ మండలంలోని పోచారం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్క రించుకొని సోమవారం సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఆటల పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా క్యారం బోర్డు, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్‌లో 16 జట్లు, క్యారం బోర్డు లో 20 జట్లు, వాలీబాల్ లో 8 జట్లు పాల్గొన్నాయి. హెూరాహెూరీగా సాగిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు మాల్‌తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్‌లో శ్రీనివాస్ రెడ్డి యాదగౌడ్ మొదటి బహుమతి అందుకున్నారు. అదేవిధంగా వాలీబాల్ లో యాద గౌడ్ కు చెందిన టీం మొదట బహుమతి గెలుపొందింది. క్యారం బోర్డులో బోయిని రాజు రేణువర్ధన్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. కబడ్డీ జూనియర్స్‌లో డానియల్ టీం మొదటి బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు గ్రామ సర్పంచ్ విజిత రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని అధికారులు మంగళవారం టాస్క్ ఫోర్స్ అధికారులు అంజయ్య, అజయ్ బాబులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన అలీ, ముఖీద్ లపై పిడి యాక్ట్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుదీర్ రావు తెలిపారు. వీరి వద్ద సుమారు 40 క్వింటాళ్ల పిడి ఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.


బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకున్న అధికారులు

తడపాకల్ విద్యార్థులకు

బాల ప్రతిభ పురస్కారాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సౌమ్య సమ్రీన్ అనే విద్యార్థులు బాల ప్రతిభ పురస్కారాలు అందుకున్నట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ గ్రామానికి చెందిన చింతోజు బ్రహ్మయ్య జ్ఞాపకార్థం జాతీయ స్థాయిలో సాహిత్య రంగంలో రాణిస్తున్న విద్యార్థులకు ఈ పురస్కారం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, ఎస్.ఎం.సి.చైర్మన్ శ్రీనివాస్ అభినందించారు.


పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

మోటార్ వెహికిల్ చట్ట సవరణ

డ్రైవర్‌లకు మరణ శాసనమే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హిట్, రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. మంగళవారం గోదాం రోడ్ ఆటో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గల ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్టం 2019లో సవరణలు చేస్తూ కార్మికుల మరణ శాసనాన్ని రాస్తుందని అన్నారు. ఆ చట్టాన్ని వెంటనే ఉపసంహరించు కోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేసే కార్మికులు, ఓనర్లు ప్రభుత్వంపై ఆధారపడకుండా, ప్రైవేటు ఫైనాన్స్‌ల దగ్గర, బ్యాంకర్ల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేసి, తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం, ప్రజా రవాణా ద్వారా ప్రజలకు నిత్యం సేవ చేస్తూ బతుకుతుంటే, కేంద్ర ప్రభుత్వం మూలిగే నక్క పై తాటికాయబడ్డ చందంగా మోటార్ వెహికల్ చట్టంలో సవరణ లు చేసి హిట్, రన్ చట్టాన్ని తీసుకు రావడంతో రవా ణా రంగంలో డ్రైవర్లుగా పని చేస్తున్న వారిని ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆటోలు కొనుక్కున్న ఓన ర్లను వాటికి దూరం చేయడం అవుతుందన్నారు. ఎవరు కూడా కావాలని ప్రమాదం జరగాలని కోరుకోరని, ఈ ప్రభుత్వ విధానాల వల్ల సరైన రోడ్లు లేక ప్రభుత్వం విధించే అధిక పెనాల్టీలు అధిక వడ్డీలు భరించలేని కార్మికులు అనివార్య కారణాలవల్ల ఏదైనా తప్పిదం జరిగితే, వారికి పది సంవత్సరాల జైలు శిక్ష, 7 లక్షల రూపాయల జరిమానా విధించడంతోపాటు లైసెన్సును రద్దుచేసి ఆ వృత్తికి దూరం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే, రాబోయే కాలంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ఆవేశానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.హనుమాన్లు, ముత్యాలు, యూనియన్ అధ్యక్షులు మోహిన్, నాయకులు కైసర్, అక్రమ్, లక్ష్మీనారాయణ, చంద్రకాంత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఓమయ్య

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం


విరాళం అందజేస్తున్న జలపతిరెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన సింగిరెడ్డి జలపతి రెడ్డి ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ. 50వేల 116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం విరాళం మొత్తాన్ని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. వారికి వారి కుటుంబానికి అయ్యప్ప ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, బద్దం రాజేష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, సంత నడిపి రాజేశ్వర్, పార్శపు జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టను సందర్శించిన జిల్లా న్యాయమూర్తి


సిద్దుల గుట్టపై న్యాయమూర్తి, తదితరులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్టను నిజామాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తులు మంగళవారం సందర్శించారు. అక్కడి స్వయంభూ శివలింగం ప్రాముఖ్యత, మహత్యం తెలుసుకున్నారు. జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, జిల్లా అదనపు డీసీపి జయరాం నవనాథ సిద్దులగుట్టపై వెలసిన స్వయం భూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు కుమార శర్మ నేతృత్వంలో న్యాయమూర్తులకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ పవిత్ర సిద్దుల గుట్ట మహత్యం చాలా గొప్పదని, దర్శనానికి న్యాయమూర్తులు, పోలీస్ అధికారులతో పాటు కుటుంభ సభ్యులతో కలిసి వచ్చామని అన్నారు. గుట్టపై అద్భుతంగా ఉందని, చాలా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు, పోలీస్ అధికారులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్ ఖాందేష్, న్యాయాధికారులు, న్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నంది గుడి చరిత్రపై డాక్యుమెంటరీ చేయాలి

- ఆలయ కమిటీ తీర్మానం


సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని నందిపేట నంది గుడి ఆలయ నూతన కమిటీ తొలి సమావేశం సోమవారం నిర్వహించారు ఆలయ చరిత్రను, ఆలయంలోని శివలింగ మహత్యాన్ని, ఆలయంలోని నంది తొలినాళ్లలో చిన్నదిగా ఉండి, క్రమంగా పెరిగి, నందీశ్వరుని పేరుతోనే ఈ గ్రామానికి నందిపేట అనే పేరు వచ్చిన క్రమాన్ని, చరిత్రకారుల కృషితో డాక్యుమెంటరీ చేయడానికి తీర్మానించారు. ఆలయ ప్రాంగణంలో వీరభద్ర స్వామి గోపురాన్ని నిర్మించడానికి సంకల్పించారు. ఆలయంలో ఇకనుండి నిత్య ప్రసాదం అందించాలని, ఆలయానికి ఆదాయం వచ్చే విధంగా ఐదు మడిగలను నిర్మించి, ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేయాలని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మచ్చర్ల సాగర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నవీన్, మచ్చర్ల చిన్న సాయన్న, ప్రసాద్, వైస్ చైర్మన్ చింతల కిషన్, కోశాధికారి ఎర్రం నడిపి ముత్యం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కమిటీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ గ్రామ అభివృద్ధి కమిటీ కలిసి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందరం శ్రావణ్, కోశాధికారి నర్సయ్య, దనురాజ్, అంజయ్య, పంచాయితీ పాలకవర్గ సభ్యులు శ్రీహరి, రమేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


వీడీసీ సభ్యున్ని సన్మానిస్తున్న సర్పంచ్, పాలకవర్గ సభ్యులు

వైకుంఠధామంలో సౌకర్యాలు కరువు

- వృథాగా నీటి ట్యాంకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి మండలం జంలం గ్రామంలో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దాంతో బాధిత కుటుంబీకులు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 12లక్షల 60వేల రూపాయల నిధులు వెచ్చించి గ్రామ శివారులో వైకుంఠధామాన్ని నిర్మించింది. అందులో అంత్యక్రియలకు వచ్చిన వారికి పలు సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మహిళలకు టాయిలెట్స్, విశ్రాంతి గది, స్నానాలకు నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణ సక్రమంగా లేదు. దాంతో మహిళలు స్నానాలు చేసే గదికి తాళం వేసి ఉంది. అలాగే విశ్రాంతి కోసం నిర్మించిన హాల్ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగి కూర్చోడానికి వీలు లేకుండా పోయింది. అలాగే కాళ్ల చేతులు శుభ్రం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన నీటి ట్యాంకుకు దానికి కనీసం కుళాయి కనెక్షన్ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దాంతో నీటి సౌకర్యం లేక బాధిత కుటుంబీకులు, అంత్యక్రియలకు వచ్చిన బంధువులు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తింది. లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామంలో గ్రామ పంచాయతి పాలకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంపై గ్రామస్తులు, అంత్యక్రియలకు వచ్చిన వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్పంచ్ స్పందించి వైకుంఠధామంలో సరయిన సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వృథాగా ఉన్న నీటి ట్యాంకు


వైకుంఠధామం

పేదలకు బియ్యం పంపిణీ


బియ్యం అందజేస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ, వారి ఆధ్వర్యంలో మంగళవారం జిరాయత్ నగరులోగల విద్యా హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన 'అవ్వకు బువ్వ' కార్యక్రమంలో ప్రతి నెలలో భాగంగా పేదలకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 54 మంది పేదవృద్దులకు ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక

అధ్యక్షులు శ్రీనివాస్ ఖాందేష్, ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ.. అవ్వకు బువ్వ కార్యక్రమం ద్వారా పేద వృద్దులకు తమవంతు సహకారం అందిస్తున్నామని, మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు. త్వరలో సంస్థ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు జిందమ్ నరహరి, విద్యా గోపి పట్వారి, ఎస్జీ శ్రీకాంత్, కోశాధికారి గోనె శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శులు బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం, తులసి పట్వారి, మక్కల సాయినాథ్, మీరా శ్రావణ్ సభ్యులు శరత్, ఖోడే శ్రీనివాస్, రాజేష్, సంజీవ్, ప్రశాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు కిషోర్‌ను పరామర్శించిన పోచారం


పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో మంగళవారం ఉదయం మాజీ శాసనసభాపతి పరిగె పోచారం శ్రీనివాసరెడ్డి ఉమ్మడి మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబును పరామర్శించారు. వారం రోజుల క్రితం కామారెడ్డి జిల్లా దగ్గి వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురి కావడంతో దానిలో ప్రయాణిస్తున్న ఎంపీపీ భర్త శ్రీనివాసరావు, మాజీ ఏఎంసి గంగాధర్, ఏఎంసి హమీద్ గాయాల పాలయ్యారు. కొల్లూరు కిషోర్ బాబు, శ్రీనివాసరావు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటికి రావడంతో మంగళవారం పోచారం శ్రీనివాస్ రెడ్డి కిషోర్ బాబుని పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకొని వారికి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చరవాణిలో శ్రీనివాసరావును, అబ్దుల్ హమీదును వారి ఆరోగ్య విషయంపై వివరాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం మిర్జాపూర్ క్యాంపులో ఎన్టీఆర్ విగ్రహనిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి లక్ష్మణ్, నాయకులు బీర్కూర్ గంగాధర్, కొల్లూరు రమేష్, శ్రీధర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చిచ్చుపెట్టే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

- మాజీ ఎమ్మెల్యేపై అంకాపూర్ గ్రామస్తుల ఫైర్

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామస్తుల మధ్య మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిచ్చుపెట్టే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అంకాపూర్ గ్రామస్తులు మండిపడ్డారు. మండలంలోని అంకాపూర్ గ్రామపంచాయతీ వద్ద సోమవారం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని గ్రామస్తులు గతంలో దాడి చేసి బహిష్కరించారని, ఆవ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అంకాపూర్ గ్రామంపై అనుచిత వ్యాఖ్యలుచేస్తే మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పచ్చని గ్రామాల్లో కల్లోలం సృష్టించాలని చూస్తున్నాడని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇటీవల గెలవడంతో మాజీ ఎమ్మెల్యే ఓర్చుకోలేక రాజకీయంగా కాకుండా గ్రామాలవద్ద గొడవ ద్వారా ఎదగాలని చూస్తున్నాడని ఎందరో పేద విద్యార్థులకు విదేశీ విద్యకోసం ఆర్థిక సహాయాలు, ఆస్పత్రిలో ఉంటే ఆర్థిక సహాయాలు చేస్తూ గ్రామంలో అందరి మన్నలను పొందాడు అని అన్నారు.జీవన్ రెడ్డి గురిడి రెడ్డి సంఘం గురించి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి గురించి మాట్లాడిన మాటలన్నీ అబద్ధాలని అన్నారు. గ్రామ కమిటీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని చెట్టుకు కట్టేసి కొట్టామని ఎవడు చెప్పాడో నిరూపించాలని అన్నారు.ఎవరైతే నీతో చెప్పారో వారిని తీసుకు రావాలని తెలిపారు. నిరూపిస్తే దేనికైనా సిద్ధమని ఛాలెంజ్ విసిరారు. ఎమ్మెల్యేపై అనుచితంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గంజాయి, డ్రగ్స్ తీసుకుంటాడని, ముగ్గురు పెళ్ళాలని అన్నమాటలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని చెప్పారు. అవకాశం వచ్చింది కాబట్టి మాగ్రామ మనిషిగా గెలిపించుకున్నా మన్నారు. జీవన్‌రెడ్డికి ఎన్నికల్లో ఓడిపోయిన నుండి మతిభ్రమించిందని అన్నారు. మూడువేల మెజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కుటుంబం గురించి మాట్లాడడం సిగ్గుచేటని తెలిపారు. జీవన్ రెడ్డి నీకు దమ్ముంటే అంకాపూర్ వచ్చి గ్రామస్తులతో చర్చకు రా..అని అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంకాపూర్‌లోని ఇంటిని ముట్టడించి నిన్ను గ్రామంలో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, ఎన్నిసి గంగారెడ్డి, పల్లె గంగారెడ్డి, మాన్సూర్ భూమేష్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఘనంగా అయ్యప్ప మెట్లపూజ

- ఆభరణాల ఊరేగింపు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని శ్రీ మణికంఠ సన్నిధానంలో అయ్యప్ప మెట్లపూజ ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామప్రధాన వీధుల గుండా అయ్యప్ప ఆభరణాలను ఊరేగించి, మధ్యాహ్నం మెట్ల పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రికి ఆలయ ప్రధాన పూజారి గణేష్ జోషి ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి, పదునెట్టంబడి (మెట్లపూజ) ను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రవర్మ గురుస్వామి బృందం పాడిన భజన కీర్తనలు పలువురు భక్తులను ఎందరినో ఆకట్టుకున్నాయి. అయ్యప్ప నామస్మరణ, శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. రాత్రికి హాజరైన అయ్యప్ప స్వామి భక్తులందరికీ తీర్థ ప్రసాదా లతోపాటు అ ల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో గురు స్వాములు చిన్న గణేష్, ధర్మపురి కాంపౌండర్, ఠాకూర్ బలరాం సింగ్, మెడికల్ నరేందర్, జాపు సాయినాథ్, కోటగిరి రమేష్, అంబటి నవీన్, గాండ్ల రాజేష్, బట్టు నవీన్, యమగంటి లింగాగౌడ్, బోట్ల రవీన్ ప్రసాద్, పిల్లేండ్ల సంతోష్, పోశెట్టి, సురేష్ ఆలయ కమిటీ చైర్మన్ సిహెచ్ కిషన్, మాజీ సర్పంచ్ తౌట్ గంగాధర్, రంగంపేట యాదగిరి, పలువురు అయ్యప్ప గురుస్వామిలు, కన్నెస్వామి పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గుంటూరుకారం సినిమాలో

విలన్స్‌కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

- అసభ్యకర మడత కుర్చీ బూతు పాటను తక్షణమే తొలగించాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహేష్ బాబు కథానాయకుడిగా విడుదల అయిన గుంటూరుకారం సినిమాలో విలన్స్ కు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి వారి పాత్రలను చెడుగా చూపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. అసభ్యకరంగా రాసిన మడత కుర్చీ బూతు పాటని తక్షణమే సినిమాలో నుండి తొలగించాలని, సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్‌కు మతి భ్రమించిందని తెలిపారు. ప్రపంచ కమ్యునిస్టు విప్లవకారులు, మార్కిస్ట్ మహోపాధ్యాయుల పేర్లను ఈసినిమాలో విలన్స్‌కి పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన వ్యక్తి, శ్రామిక వర్గ సిద్ధాంతం "దాస్ కాపిటల్" రచించి ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గాన్ని విముక్తి చేయడానికి తన జీవితాన్ని ధారపోశాడని తెలిపారు. కామ్రేడ్ లెనిన్ మార్క్సిజంతో రష్యా దేశంలో విప్లవాన్ని విజయవంతం చేశాడని, దోపిడీ, పీడన, అణచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పరిచాడని, అలాంటి మహనేతల పేర్లని గుంటూరుకారం సినిమాలో విలన్స్‌కు పెట్టడం తీవ్రమైన అభ్యంతరకరమని అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్ బాబు చేసిన ఈ తప్పిదానికి బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన గొల్ల శోభన్ (32) బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్ దేశం పోయి వచ్చి, ఇంటి దగ్గర ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటు న్నాడు. ఈనెల 13న ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిం చారు. ముప్కాల్‌లోని మమత నర్సింగ్ హెూంలో ఈనెల 14న మృతి చెందాడు. మృతుని తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


యువకుని మృతదేహం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
బుధవారం | జనవరి 17, 2024 | www.navatelangana.com

పండుగ పూట విషాదం..

- పది రోజుల వ్యవధిలో అన్నదమ్ములు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

సంబరాల సంక్రాంతి వేడుకలు నిర్వహించుకుంటున్న వేళ.. ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే అన్నదమ్ములు మృతి చెందిన విషాదకర ఘటన మండలంలోని అంకాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కిషన్ అనారోగ్యంతో సోమవారం మరణించినాడు. ఈయనకు భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆయన తమ్ముడు నరసయ్య పది రోజుల క్రింద చెరువులో పడి మరణించినాడు. అన్నదమ్ముల మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

కమ్ముకున్న పొగ మంచు

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి మండలంలో మంగళవారం ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్ముకుంది. రోడ్లపై వాహనదారులు ప్రయాణిస్తుండగా.. ముందు ఉన్న వారు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూర్యుడు ఉదయించినా 8 గంటల వరకు సైతం పరిసరాల్లో పొగమంచు కమ్ముకుంది. అయితే గత రెండుమూడు రోజుల కంటే చలి తీవ్రత పెరిగింది.


కమ్ముకున్న పొగమంచు

సమయ పాలనేది..?

- పదిన్నర దాటినా పత్తాలేని పలువురు అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడపగల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులు సమయ పాలన పాటించకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించగా.. ఉదయం పదిన్నర గంటలు అవుతున్నా.. తహసీల్దార్, అటెండర్ తప్ప మిగతా అధికారులు హాజరుకాలేదు. దీంతో పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు పనులు సకాలంలో పూర్తి కాకుండా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 10 గంటలకు అధికారులు కార్యక్రమంలో సమయానికి ఉండాల్సింది పోయి 10.25 దాటినా పలు అధికారుల కుర్చీలు ఖాళీగానే దర్శనం ఇస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఒక్కరు మాత్రమే ఒక్కరు సమయానికి కార్యాలయంలో ఉండగా మిగిలిన అధికారులు మాత్రం విధుల్లో లేరు. దీంతో వచ్చిన ప్రజలకు వారి సేవలు ఏ విదంగా అందుతుందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తహశీల్దార్ కార్యాలయ సిబ్బందిలు సమయ పాలన పాటించి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


ఉదయం పదిన్నర గంటలు కావొస్తున్న ఖాళీగా ఉన్న కుర్చీలు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బ్రహ్మం గారి మందిరం ఎదురుగా క్రికెట్ టోర్నమెంట్ సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో క్రికెట్ క్రీడాకారులకు, అభిమానులకు నూతన ఉత్తేజాన్ని నింపాలనే దృఢ సంకల్పంతో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టోర్నమెంట్‌కు గాను 40 టీం లు పాల్గొంటున్నాయని తెలిపారు. క్రికెట్ క్రీడాకారులు క్రమశిక్షణతో మెలిగి , నియమ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ప్రతి మ్యాచ్ కు మ్యాన్ ది మ్యాచ్ , టోర్నమెంట్ హాఫ్ ది సిరీస్ అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రథమ బహుమతికి గాను 22 వేల 222 కాగా ద్వితీయ బహుమతికి 11 వేల 111 రూపాయలతో పాటు మెమెంటో బహుమతుల ప్రదానం స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌ను వివేకానంద కరస్పాండెంట్ ఎనుగండ్ల శ్రీనివాస్ రెడ్డి స్పాన్సర్ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాంటీగే హన్మాండ్లు, సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బోడ్ల రాజు, కృష్ణ రెడ్డి, దయానంద్, శివ, చారి, చింతల సాయిరెడ్డి, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేత


కిట్లు అందజేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పరమళ్ల గ్రామంలో మంగళవారం సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా యువజన సంఘాలకు క్రికెట్, వాలీబాల్ కిట్లు గ్రామ సర్పంచ్ పరువయ్య ఉపసర్పంచ్ భూపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి లెగ్గెల రాజు మాట్లాడుతూ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుకోవడానికి క్రికెట్ కిట్లు వాలీబాల్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. తమ సత్తా చాటుకోవడానికి మంచి అవకాశం అన్నారు. క్రికెట్ వాలీబాల్ కిట్లు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మండల స్థాయి జిల్లా స్థాయి వరకు క్రీడల్లో పాల్గొనాలని క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ కుమ్మరి అశోక్, బండ.మహేష్ ఎస్ఎంసి చైర్మన్ ప్రభురాజు, బిఆర్ఎస్ యువత అధ్యక్షులు ప్రసాద్, చాకలి.అశయ్య, అశోక్,శ్రీను, సాయికుమార్, బాలు,దుర్గేష్, సాయిలు, ప్రశాంత్ ,రాజు,అఖిల్, గంగారం తదితరుల పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న పోలీసులు, అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో తాడ్వాయి చౌరస్తా లో రోడ్డు భద్రతా నియమాలు రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో తాడ్వాయి ఆటో డ్రైవర్లకు, వాహనదారులకి ఏఎంవీఐ విక్రమ్ తన సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు, ఏఎంవీఐ విక్రమ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చాలామంది రోడ్ల పైన తమ వాహనాలను సరిగా నడపక ప్రమాదాలకు గురి అయ్యి తనంతట తాను గాని లేక ఎదురు వాళ్లకు గాని ప్రాణ నష్టం, అంగ వైకల్యం వచ్చే విధంగా నడుపుతున్నారని తెలిపారు. మోటార్ సైకిల్ నడపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పెద్ద వాహన దారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి గ్రామ సర్పంచ్ సంజీవులు వైస్ ఎంపీపీ నర్సింలు గ్రామ పెద్దల తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం వద్ద పంచనామ చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శంకర్ (46) గత కొంతకాలంగా కడుపునొప్పి, చాతి నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం కడుపునొప్పి బాధ భరించలేక ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, కుటుంబీకుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గ్రామంలోని చెరువు వద్ద చెప్పులు, బట్టల ఆనవాళ్లు కనిపించగా గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో వెతికి చూడగా శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

అండర్ 14 రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు విష్ణు, జస్వంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుర్గా రెడ్డి మంగళవారం తెలిపారు. నవంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 18 వరకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి. శ్రీధర్. పాఠశాల బృందం వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్. జూనియర్ అసిస్టెంట్ శేఖర్. నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులను అభినందించారు.

ఆర్థికఇబ్బందులతో జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

- జీతాలు రాక, ఉద్యోగ ఐడీ నెంబర్ జనరేట్ కాక తీవ్ర మనస్తాపం

నవతెలంగాణ-దోమకొండ

ఆర్థిక ఇబ్బందులతో ఓ జూనియర్ అసిస్టెంట్ మనస్తపాం చెంది బీబీపేట పెద్ద చెరువు లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బిబీపేట మండల కేంద్రం లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ మండలం లోని బస్వపూర్ గ్రామానికి చెందిన మార్కంటి శ్రీకాంత్ (27) బీబీపేట్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నడు. గత కొన్ని నెలల నుండి జీతాలు రాక పోవడం, ఉద్యోగ ఐడి కార్డ్ లు ఇవ్వకపోవడంతో మనస్తపం చెందాడు. బస్వాపూర్ గ్రామం ఇంటి వద్ద నుండి ఉదయం విధులకు వెళ్తున్నట్టు చెప్పి వెళ్లి బీబీపేట మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి మార్కంటి శంకరయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహం పంచనామన నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్

ఉత్కంఠగా సాగిన క్రికెట్ టోర్నమెంట్

- ఫైనల్ టోర్నమెంట్ విజేత సాలూర టీం

నవతెలంగాణ-బోధన్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సాలూర మండల కేంద్రంలో సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ గత వారం రోజులుగా నిర్వహించిన సీజన్-3 క్రికెట్ టోర్నమెంటులో ఫైనల్ విజేతగా సాలూర ఛత్రపతి శివాజీ టీం విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలలో పెగడపల్లి టీంపై సాలూర ఛత్రపతి శివాజీ టీం సభ్యులు హోరాహోరిగా తలపడి విజయం సాధించారు. పెగడాపల్లి టీం 12 ఓవర్లలో 127 పరుగులు చేయగా సాలూర ఛత్రపతి శివాజీ టీం 10 ఓవర్లలో 128 పరుగులు చేసి ఫైనల్ విజేతగా నిలిచింది. క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగ సమీప గ్రామాల ప్రజలు క్రికెట్ టోర్నమెంట్ తిలకించేందుకు తరలివచ్చారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు సొసైటీ చైర్మెన్ అల్లె జనారన్ ట్రోఫీని అందించారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేతకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో నాయకులు అల్లె రమేష్, సర్పంచ్ చంద్రకళ, సురేష్, బుద్దె లక్ష్మణ్, సీఈవో బస్వంత్ రావు, వైస్ చైర్మెన్ సందీప్ రెడ్డి, సాయిలు, దత్తు, సొక్కం రవి. డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందుకుంటున్న సాలూర టీం

సంక్రాంతి సందడి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే వాకిళ్లల్లో రంగురంగుల ముగ్గులు వేసి సంబురపడ్డారు. చిన్నాపెద్ద తేడా లేకుండా పతంగులు పోటాపోటీగా ఎగురవేశారు. పలు చోట్ల సౌండ్‌బాక్సులు పెట్టుకొని డీజీ పాటలతో ఊదరగొట్టారు. సాంప్రదాయంగా చిన్నారులకు రేగుపండ్లు పోసి పెద్దలు దీవించారు. పిండివంటకాలు చేసుకొని ఆరగించారు.

- నవతెలంగాణ, నిజామాబాద్‌సిటీ



తమ ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న యువతులు.. పిల్లలపై రేగుపండ్లు..



తమ వాకిళ్ల ముందు ముగ్గులు వేసి రంగులు నింపుతున్న యువతులు


బాల్కొండలో ముగ్గులు వేస్తున్న యువతులు..


ముగ్గు వద్ద చిన్నారి సందడి..


పతంగులు ఎగురవేస్తూ పిల్లల సంబరాలు


ఉత్సాహంగా పతంగులు ఎగురవేస్తున్న యువకులు..


సౌండ్ బాక్సులు పెట్టుకొని డీజే పాటలతో నృత్యాలు చేస్తూ..

బీసీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం- కామారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హైదరాబాదులోని బీసీ భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ, మండల ,డివిజన్, నియోజకవర్గాల్లో విద్యార్థి, యువజన, మహిళ, సంక్షేమ సంఘం కమిటీలను బలోపేతం చేయాలని మార్పు చేర్పులు చేయాలని రాష్ట్ర, జిల్లా నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాముని సుదర్శన్ నేత, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల శంకర్ , మహిళ రాష్ట్ర కార్యదర్శి పోషవ్వ, కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల, సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జ్ సిరిగాధ రాజేందర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి శ్రావణ్ కుమార్ గౌడ్ , బీసీ నాయకులు వెంకటేశ్వర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి తండాలో కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను సర్పంచ్ యాదవ్ సునీత బాబు నాయక్ ప్రారం భించారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 20 టీములు రాగా కబడ్డీ పోటీలను లక్కీ డ్రా ద్వారా నిర్వహిం చారు. గెలుపొందిన విద్యార్థు లకు బహుమ తులను అంద జేయ నున్నట్లు వారు పేర్కొ న్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్

చందూర్‌లో పశువుల దొడ్డి కార్యక్రమం, అన్నదానం

నవతెలంగాణ-వర్ని

సంక్రాంతి పండగ సందర్భంగా మూడవ రోజు కనుమ పండగన సాంప్రదాయంగా గ్రామ చెరువు వద్ద పశువులకు దొడ్డి నిర్మాణం చేసి పశువుల కాపారులు అన్నదానం చేసుకొంటారు. సంక్రాంతి పండగ వేళ పాడి, పంటలు, ప్రజలు సుఖసంతోషా లతో ఉండడానికి జరుపుకుంటారని సర్పంచ్ కర్లం సాయిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, పశువుల కాపర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అనుమతులు తప్పనిసరి

ఎస్ఐ భాస్కరా చారి

నవతెలంగాణ-ముప్కాల్

సుప్రీంకోర్టు తీర్పు, నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలను సారం ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపైన విగ్రహాలను పెట్టరాదని, ముప్కాల్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్ భాస్కరా చారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన రోడ్లపై విగ్రహాలను పెట్టదలుచుకున్నప్పుడు ముందస్తుగా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోని ప్రధాన కాలనీల్లో, ఫంక్షన్ హాల్‌లో కానీ డీజెలు పెట్టుటకు ముందస్తుగా పోలీస్ శాఖ అనుమతులు పొందాలని పేర్కొన్నారు. నివాస స్థలాల్లో, పోలీసుల అనుమతి లేకుండా ప్రజల మధ్యలో కానీ, ఫంక్షన్ హాల్లో కానీ, ప్రీ వెడ్డింగ్ షూట్‌ల పేరిట కెమెరా డ్రోన్‌లను ఉపయోగించ కూడదని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనుమతులకు పోలీస్ శాఖను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

ఎర్రజొన్నలు, పసుపును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో ఎర్రజొన్నలు క్వింటాలకు 4500 చొప్పున, పసుపుకు క్వింటాలుకు 15వేల రూపాయలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐపికెఎస్ డిమాండ్ చేసింది. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపికెఎస్) నిజామాబాద్ జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశం కామ్రేడ్ ఎస్ సురేష్ అధ్యక్షత జరుగగా రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.దేవారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుబంధు సంవత్సరానికి 15వేలు ఎకరానికి చెల్లించాలని, నిజామాబాద్ జిల్లాలో గల ఎన్ఎస్ఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీ లతోపాటు మెట్పల్లి, మెదక్ ఫ్యాక్టరీలు వెంటనే తెరిపించాలని అన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ రైతులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమాతోపాటు రైతు రక్ష చర్యలు చేపట్టాలని గుర్తు చేస్తూ జిల్లాలో ఎర్రజొన్నలు క్వింటాలకు 4500 చొప్పున, పసుపుకు క్వింటాలుకు 15వేల రూపాయలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడం వలన ఓటమిపాలైందని, కాంగ్రెస్ పార్టీ గుణపాఠంగా స్వీకరించి రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని అన్నారు. అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున రైతులను రోడ్డుపైకి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రైతు డిమాండ్లపై పోరాటం చేస్తున్న సందర్భంలో జిల్లాలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు గత ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులు అన్నిటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్, బాబన్న, రాజేందర్, యు.రాజన్న, పుట్టి. నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

- అర్బన్ టీడీపీ పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 18న ఎన్టీఆర్‌కి ఘన నివాళులు సందర్భంగా దుబ్బాలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, దీనికి ముందు ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించడం జరుగుతుందని, అర్బన్ పార్టీ కన్వీనర్ అంబికా సత్యనారాయణ, కో కన్వీనర్ కల్లెడ బండారి గంగాధర్, కోయెడి నర్సింలు గౌడ్ తెలిపారు. కూడు, గూడు, గుడ్డ అందరికీ అందాలని బడుగు బలహీన వర్గాల వారు ఆర్థిక సామాజిక సాంఘికంగా పేదరికం లేని సమాజ స్థాపనకై కృషిచేసిన కృషీవలుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి వర్ధంతిని తెలుగుజాతి ఘనంగా అన్నదాన, రక్తదాన, కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 18న దుబ్బలో జరిగే అన్నదాన కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేంజర్ల సురేష్, అర్బన్ కో కన్వీనర్లు కల్లేడ బండారి గంగాధర్, కొయేడి నర్సింలు గౌడ్, జిల్లా నాయకులు ఎండీ రఫిక్ ఖాన్, పార్టీ అర్బన్ నాయకులు లవంగా రాజు, మల్లారెడ్డి, లక్ష్మీ యాదవ్, గంగోనే రాజేశ్వర్, సర్ఫరజ్, సలీం, జాఫర్, వసీం తదితరులు పాల్గొన్నారు.

రేపు మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి

నవతెలంగాణ-బోధన్

ఈనెల 18న బోధన్, సాలూర మండలాల్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కావున కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఎన్టీఆర్ కు ఘన నివాళులు అర్పించాలని తెలుగుదేశం పార్టీ బోధన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోట గోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఉమ్మడి మండలంలోని పెంటాఖుర్దు, జాడి జమాల్పూర్, ఎరాజ్ పల్లి, సాలూరు క్యాంప్ గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కామ్రేడ్ బిల్ల బాగులుకు జోహార్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు, అమరుడు కామ్రేడ్ బిల్ల బాగులు రెండవ వర్ధంతి సందర్భంగా శ్రామిక భవన్, కోటగల్లీలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. కామ్రేడ్ బిల్ల బాగులు నందిపేట మండలంలోని ఐలాపూర్ గ్రామం పేద మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడన్నారు. బీడీ వర్కర్‌గా పనిచేస్తున్న సమయంలో యూనియన్‌లో చేరి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎదిగాడన్నారు. సుదీర్ఘకాలం యూనియన్‌లో క్రియాశీలంగా పనిచేస్తూ మినీ సిగరెట్ల వ్యతిరేక ఉద్యమం, తప్పుడు బాల కార్మికుల రిపోర్టుకు వ్యతిరేకంగా, బీడీ కట్టమీద పుర్రె బొమ్మలకు వ్యతిరేకంగా, ఆకు, తంబాకు, ఉత్పత్తి పెంపుదలకు, పని దినాల పెంపుదలకు, పీఎఫ్ అమలు కోసం యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. దోపిడీ పీడనలేని శ్రామికరాజ్యం రావాలని పోరాడిన బిల్ల బాగులు ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న, ఐఎఫ్‌టీయూజిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్, జిల్లా నాయకులు పి.సాయరెడ్డి, బి.మురళి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, యూనియన్ నాయకులు జీ. గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.


ఆర్మూర్ : బహుమతులు అందజేస్తున్న పట్వారి గోపికృష్ణ


నిజామాబాద్‌సిటీ : గాలిపటం ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సంస్కృతి, సాంప్రదాయం @ సంక్రాంతి

- ఘనంగా సంక్రాంతి వేడుకలు
- రంగుల ముగ్గులతో మెరిసిన వాకిళ్లు
- గాలిపటాలతో యువకుల కేరింతలు
- పిండివంటల ఘుమఘుమలు

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్ :పల్లె సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే పండగ సంక్రాంతి అని, రకరకాల ముగ్గులు వేయడంలో మహిళలు, యువతులు, చిన్నారుల కృషి అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు గోపి కృష్ణ పట్వారి అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్, హనుమాన్ మందిర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిరాయత్‌నగర్ హనుమాన్ మందిర ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పాల్గొని దేశ సంస్కృతి ఉట్టిపడేలా ముగ్గులు వే:ఇరు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ అధ్యక్షులు స్పాన్సర్, ప్రాజెక్ట్ చైర్మన్ పట్వారీ గోపికృష్ణ చేతుల మీదుగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి విజేతలుగా నిలిచిన ప్రథమ,ద్వితీయ, తృతీయ మహిళలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ ముగ్గులో ఉండే రంగుల వలే మీ జీవితం ఆనంద రంగోలిగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మి నారాయణ, కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, న్యాయవాది ఖాందేశ్ శ్రీనివాస్, పుష్కర్ రావు, సురేష్, ఆనంద్, సత్యం, హనుమాన్ మందిర కమిటీ అధ్యక్షులు విట్టోబా శేఖర్, నూఖల శేఖర్, భాస్కర్, నవీన్, అంబల్ల శ్రీనివాస్, తిరుపతి, దత్తాద్రి, పిట్ల శ్రీధర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని పలు వార్డులతో పాటు మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ,మామిడిపల్లి మండలంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు సంబురంగా నిర్వహించుకున్నారు. వాకిళ్లన్నీ రంగురంగుల ముగ్గులతో, ప్రకృతితో మమేకమై పిల్లల కేరింతలు చిన్నారులకు బోగిపండ్లు పోయడం ఆనవాయితీగా జరుపుకుంటున్నారు. సంక్రాంతి, కనుమ వేడుకలు అంబరాన్నంటాయి. కొన్ని కుటుంబాల్లో బోగిపళ్లను పెండ్లి అయ్యేంతవరకు పోయడం సంప్రదాయం.. ఉద్యోగ రిత్యా వివిధ చోట్ల ఉన్న వారు స్వగ్రామంలో మంగళవారం కనుమ సంబరాలు నిర్వహించుకున్నారు.

బోధన్: సంక్రాంతి పండుగను పుస్కరించుకుని మూడు రోజులపాటు బోధన్ ఉమ్మడి మండలంలో ప్రజలు ఘనంగా సంక్రాంతికి పండగ వేడుకలను నిర్వహించారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా చిన్నారులపై భోగి పళ్ళు వేసి భోగిమంటలతో పండగను ఘనంగా చేసుకున్నారు. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలు రంగురంగుల ముగ్గులతో ఇంటిని అలంకరించి , వారి పంట పొలాల్లో పాండవుల పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు పుష్కలంగా పండి రైతన్నలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ పంటచేనులో పాలు పొంగించి పూజలు నిర్వహించారు. అనంతరం పిండివంటలతో బంధుమిత్రులను ఆహ్వానించి పండగ జరుపుకున్నారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా మాంసాహార వంటలతో నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మహిళలు ప్రత్యేక నైవేద్యాలతో తయారు చేసిన వంటకాలతో నెత్తిపై గంపని తీసుకొని పంట చేనులకు వెళ్లి పూజలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. యువకులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ దంపతులు సాలూర మండల కేంద్రంలోని చెక్ పోస్ట్ వద్ద వారి పంట పొలంలో ఆనవాయితీగా, సాంప్రదాయ బద్ధంగా పాండవుల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కలంగా పంటలు పండి రైతులు అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. అనంతరం బంధు, మిత్రులను ఆహ్వానించి వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వి.ఆర్ దేశాయ్ ,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సయ్య, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ రాజా గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, స్థానిక పెద్దలు స్వామి గౌడ్, సంజీవ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌సిటీ :సంక్రాంతి పండుగ వచ్చింది అంటేనే నాకు చిన్ననాటి పతంగుల పండుగలు గుర్తుకు వస్తాయి.. అని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సుర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలోని సంజీవయ్య కాలనీ, ఎల్లమ్మ గుడి దగ్గర స్థానిక యువకులతో కలసి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పతంగులు ఎగర వేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ వచ్చింది అంటేనే నాకు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి.. అని అన్నారు. చిన్నతనంలో ఇదేవిధమైన నాతోటి స్నేహితులతో కలిసి పతంగులు ఎగిరే వేసే వాడిని అని అన్నారు. ఇప్పటికి అదే విధమైన ఆనందం ఉంది అన్నారు. చైనా మాంజలు వాడకుండా ఉండాలని తెలిపారు. ప్రజలంతా ఆనందంగా సంతోషంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొద్దీ సేపు అక్కడి యువతతో పతంగులు ఎగరవేయడంతో అక్కడి ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, నాగోళ్ళ లక్ష్మి నారాయణ, మాస్టర్ శంకర్, గంగోనె రాకేష్, బొట్టు వెంకటేష్, టెంట్ హౌస్ శ్రీనివాస్, మురళి కృష్ణ, ఇల్లేందుల ప్రభాకర్, మహేష్, శివునూరు భాస్కర్, హరీష్ రెడ్డి, బీజేపీ నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ:ప్రతి సంవత్సరంలాగా నగరంలోని సంజీవయ్య కాలనీలో చిన్న నాటి స్నేహితులతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. 20 సంవత్సరాలుగా మిత్రులు అందరు కలిసి గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా డీజే సౌండ్లుపెట్టి పండుగ జరుపుకున్నారు.

కంఠేశ్వర్:సంక్రాంతి పండుగ అంటే గుర్తొచ్చేవి గాలిపటాలు, ఎగరవేయడం, ముగ్గులు వేయడం, పిండివంటలు చేయడం. మూడురోజులపాటు గాలిపటాలు ఎగరవేస్తూ చిన్నారులు, యువత పెద్దవారు ఉత్సాహంగా గడిపారు. నిజామాబాద్ నగర వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందడిగా నెలకొంది. అయితే పతంగులు ఎగరవేస్తూ సంబరాలు ఘనంగా చేసుకున్నారు. ఒక పక్క ఇంటి ఎదుట ముగ్గులు, మరో పక్క పోటాపోటీగా పతంగులు ఎగరవేస్తూ పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

బాల్కొండ:మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం మకర సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించు కున్నారు. మహిళలు చేసిన పిండివంటలు గుమగుమలాడాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా దేవాలయాలు కిక్కిరిశాయి. ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో వాకిట్లలో అందమైన ముగ్గులువేసి గొబ్బెమ్మలను పెట్టారు. గంగిరెద్దులతో సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు ఒకరికొకరు నోములను ఇచ్చిపుచ్చుకున్నారు. కొత్త పంటలతో రైతుల ఇండ్లలో సిరులు నిండాలని పూజలు నిర్వహించారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగను మండలంలోని గ్రామ ప్రజలందరూ ఆనందంగా సంతోషంగా జరుపుకున్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని ఆయా గ్రామాల్లో మకర సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అన్ని కుటుంబాల్లో ఆనందం వెల్లి వెలిసింది. రకరకాల పిండి వంటలతో ఇండ్లలో సందడి నెలకొంది. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సంతోషంతో సందడి చేశారు. మండలంలోని ఉప్లూర్ రుషికొండ అయ్యప్ప క్షేత్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం సాయంత్రం అయ్యప్ప ఆలయంలో హిందూ ధర్మం ఆస్థాన పండితులు కొడకొండ్ల శ్రీరామ శరణ్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, నెయ్యాభిషేకం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, అఖండ జ్యోతి దివ్య దర్శనం కార్యక్రమాల సమయంలో భక్తుల అయ్యప్ప నామ స్మరణతో రిషికొండ అయ్యప్ప క్షేత్రం మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:మండలంలోని ఘనపూర్ గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకొని క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ.. పండగ అంటే గ్రామంలో ఉత్సాహం ఉరకలేస్తుందని, దానికి తోడు క్రీడలు పెడితే ఇంకా రెట్టింపు ఉత్సాహం వస్తుందని అన్నారు. అందులో పిల్లలందరిని ఒక్క దగరికి చేర్చి ఆటలు ఆడించాలని, బొల్లారం దాస్ అలోచించి చెబితే ఆటలకు కావాల్సిన ప్రైజ్‌లను బొల్లారం సుమన్ అర్ఎస్ఐ కొనిచ్చారన్నారు. 1వ తరగతి నుండి, 10వ తరగతి వరకు అమ్మాయిలకు స్కిప్పింగ్, అబ్బాయిలకు స్లో సైకిలింగ్ నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామాభివృధి కమిటీ, ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు సహాయ సహకారలు అందించారు. కార్యక్రమంలో సంతోష్, రాజు హరీష్, దాస్, రంజిత్, రమేష్, తేజ, సాయిలు, అజయ్, తదితరులు పాల్గొన్నారు

భీంగల్ :మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని బొదిరె గల్లీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తోపారం సంతోషిని(ప్రథమ),తోట కవిత(ద్వితీయ), మమత(తృతీయ) స్థానంలో నిలువగా ప్రత్యేక బహుమతి ప్రియ గెలుచుకుంది. వీరికి మండల కాంగ్రెస్ నాయకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు స్వామి , పట్టణ అధ్యక్షులు జేజే నరసయ్య,కోరాడ రాజు, మహిళా అధ్యక్షురాలు కల్పన, గంగమణి, రాజేశ్వర్, నల్లూరి శ్రీనివాస్, వంశీ, దినేష్, ప్రేమ్, సతీష్, విజయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి:మండలంలో ఘనంగా సంక్రాంతి పండగ పర్వదిన వేడుకలను జరుపుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ, పండగ పర్వదినాలలో రకరకాలుగా పిండి వంటలు చేసుకున్నారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగురవేశారు. మహిళలు, బాలికలు తమ వాకిళ్లలో రంగురంగుల ముగ్గులను అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా వస్తున్న సంక్రాంతి పండగ పర్వదినాన్ని మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై విక్రమ్, ఎంపీపీ కే. శ్రీనివాస్, ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, మంగళ్ పాడ్, కుర్నాపల్లి తానాకాలన్, జైతాపూర్, ఎంఎస్సి ఫారం, సర్పంచులు బట్టు హనుమాన్లు, సావిత్రి రవీందర్ గౌడ్, రాంగోపాల్ రెడ్డి, కొక్కొన విజయ్ కుమార్, ప్రజాప్రతినిధులు అధికారులు, అనధికారులు మండల ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.


బోధన్ మండలంలో..


నిజామాబాద్‌సిటీ : నగరంలోని సంజీవయ్య కాలనీలో..


బాల్కొండ మండలంలో..


భీంగల్‌లో..


డిచ్‌పల్లి : బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


కమ్మర్‌పల్లిలో..


కంఠేశ్వర్‌లో..

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని నవీన్ విద్యానికేతన్ హై స్కూల్ 2009-10 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాండురంగ ఫంక్షన్ హాల్ లో సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 13 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమములో భాగంగా ఉపాధ్యాయులను శాలువాలకు జ్ఞాపికలకు సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

